
# సకీనా

ఖుష్వంత్ సింగ్



అనువాదం:
● జింబో

**అమృతసర్ నుంచి మధ్యాహ్నం రెండు గంటలకి బయల్దేరిన ప్రత్యేక రైలుబండి ఎనిమిది గంటల తరువాత ముగల్‌పుర లాహోర్ చేరింది. ఈ మధ్యలో ఎంతో మంది. గాయపడ్డమూ, చనిపోవడమూ, మరెంతో మంది తప్పిపోవడం జరిగింది.**

ఆ రోజు తెల్లవారి పది గంటల ప్రాంతంలో సిరాజుద్దీన్ స్పృహలోకి వచ్చాడు. అతను కటికనేల మీద పడుకుని వున్నాడు. తనచుట్టూ అంతమంది ఎందుకు గుమికూడి వున్నారో అతనికేమీ అర్థం కాలేదు. అక్కడున్న పరిస్థితి అతనికేమీ అర్థంకాలేదు. కొత్తవాళ్లకి అతను ఓ జ్ఞానముద్రలో వున్న మనిషిలా కన్పిస్తుండవచ్చు అప్పుడు. కానీ సిరాజుద్దీన్ వున్న పరిస్థితి వేరు. అంతులేని అగాధంలో కూరుకుపోయిన షాక్‌లో వున్నాడు సిరాజుద్దీన్.

కొద్దిసేపటికి అతనికేదో గుర్తుకొచ్చింది. క్రితం రోజు జరిగిన సంఘటనలు ఒకటొకటే అతని స్మృతి పథంలో మెదల సాగాయి. ఆయుధాల్తో ముట్టడి... దహనాలు.. తప్పించుకు పారిపోవడం.. రైల్వే స్టేషన్.. రాత్రి...సకీనా... అతను వెంటనే
లేచి సకీనా కోసం కాందిశీకుల గుంపులో వెతకసాగాడు.

సకీనా... సకీనా అంటూ గంటల తరబడి వెతికాడు. కానీ ఆమె జాడ ఎక్కడ కన్పించలేదు.

అక్కడంతా ఏమీ అర్థం కాని గందరగోళ పరిస్థితి. కన్పించకుండా పోయిన కూతుళ్ళకోసం, కొడుకుల కోసం, తల్లుల కోసం, భార్యలకోసం వెతుకులాట కన్పించసాగింది. ఆ గుంపునుంచి దూరంగా వెళ్ళి నేలమీద కూర్చుని వివరంగా ఆలోచించసాగాడు సిరాజుద్దీన్. సకీనాను ఆమె తల్లిని తను ఎక్కడ వదిలిపెట్టి బయల్దేరాడు. మెరుపులాగా ఏదో గుర్తొచ్చింది. చనిపోయిన భార్య, కోసివేయబడ్డ ఆమె కడుపు ఎంత భయానక దృశ్యం.

అతని భార్యని అతని కళ్ళముందే చంపేశారు. చివరి క్షణాల్లో భార్య చెప్పిన మాటలు ఇంకా అతని చెవుల్లో గింగురుమంటూనే వున్నాయి. 'నన్నికడే వదిలిపెట్టి సకీనాని తీసుకొని మీరు వెళ్ళిపొండి.. వెళ్లిపొండి..'

అప్పుడు సకీనా తను ఇద్దరమూ పారిపోవడమూ, పరిగెత్తుతుండగా సకీనా 'దుపట్టా' పడిపోవడమూ, తను దాన్ని అందుకునే ప్రయత్నం చేస్తుంటే— 'పోతే పోనీ నాన్న' అని సకీనా అనడమూ అన్నీ గుర్తుకొచ్చాయి.

అతని జేబులో ఏదో ఉబ్బుగా కన్పించింది. తీసి చూశాడు. అది సకీనా దుపట్టా. దుపట్టా వుంది కానీ సకీనా ఏదీ..?

ఏమీ గుర్తుకురావడం లేదు అతనికి. ఆమెని తీసుకుని రైల్వే స్టేషన్‌కి వచ్చాడా? ఆమె రైలు పెట్టెలోకి ఎక్కిందా? దుండగులు రైలుని ఆపి ఆమెను తీసుకొని వెళ్ళారా?

అతని మనస్సునిండా అన్నీ ప్రశ్నలే, తప్ప సమాధానాలు లేవు. అతనిలో దుఃఖం పొంగి పొర్లుకొస్తుంది. ఏడుద్దామంటే కూడా అతని కళ్ళలో కన్నీళ్ళు లేవు. ఎవరిదన్న సహాయం కావాలనిపించిందతనికి.

కొన్ని రోజుల తరువాత అతనికి సాయుధులైన ఎనిమిది మంది యువకులు కలిశారు. వాళ్ళవెంట ఒక ట్రక్ కూడా వుంది. సరిహద్దు అవతల పక్కవున్న ఆడవాళ్ళని, పిల్లల్నీ తీసుక వస్తున్నామని, తీసుకొస్తామని వాళ్ళు సిరాజుద్దీన్‌కి చెప్పారు.

సకీనా వివరాలు వాళ్ళకి చెప్పాడు. తన లాగా కాక వాళ్ళమ్మలా అందంగా, ఆరోగ్యంగా వుంటుందనీ, పెద్దకళ్ళూ, పొడవైన నల్లటి వెంట్రుకలు వుంటాయనీ, ఎడమ చెంప మీద అందమైన పుట్టుమచ్చ వుంటుందనీ, పదిహేడు సంవత్సరాలుంటాయనీ, ఎలాగైనా మా అమ్మాయి సకీనాను వెదికి తీసుకరమ్మని వాళ్ళకి చెప్పాడు సిరాజుద్దీన్.

'నిజంగానే, మీ అమ్మాయి బతికి వుంటే తప్పక ఆమెని తీసుక వస్తామని' ఆ యువకులు సిరాజుద్దీన్‌కి వాగ్దానం చేశారు.

ఆ యువకులు సకీనా గురించి చాలా చాలా వెదికారు. వాళ్ళ ప్రాణాలను తెగించి, ట్రక్కులో అమృత్‌సర్ నుంచి ఎందరో

ఆడవాళ్ళని, పిల్లల్ని క్యాంప్‌కి తీసుకవచ్చారు. సకీనా వాళ్ళకి ఎక్కడా కన్పించలేదు.

ఆ యువకులు మళ్ళీ అమృత్‌సర్ వెళ్ళినపుడు రోడ్డు పక్కన ఓ యువతి కన్పించింది. వీళ్ళని చూసి ఆమె భయంతో పరుగెత్తసాగింది. ట్రక్కు ఆపుకుని, కిందికి దుమికి ఆమె వెంబడి పరుగెత్తి చివరికి ఆమెను పట్టుకున్నారు. ఆమె చాలా అందంగా ముద్దుగా వుంది. ఆమె ఎడమ చెంప మీద అందమైన పుట్టుమచ్చ కూడా వుంది.

'భయపడకు, నీ పేరు సకీనా కదూ' అన్నాడు ఆ యువకుల్లో ఒకడు. ఆమె ముఖంలో రంగులు మారాయి. వాళ్ళు గురించి అంతా చెప్పిన తరువాత తను సకీనానే అన్న విషయం ఒప్పుకుంది ఆమె.

ఆ యువకులు ఆమెతో చాలా దయగా వున్నారు. ఆమెకు కావల్సిన ఆహారమూ పాలూ ఇచ్చారు. ఆమెని ట్రక్కులోకి ఎక్కించారు. ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా వున్న ఆమె రొమ్ముల్ని కాపాడుకోవడంలోని అవస్థని గమనించి ఆ యువకుల్లో ఒకడు అతని 'జాకెట్' ఆమె కిచ్చాడు కప్పుకోవడానికి.

చాలా రోజులు గడిచిపోయాయి. కూతుర్ని గురించిన సమాచారం ఏమీ తెలియలేదు సిరాజుద్దీన్‌కి. ప్రతిరోజూ ఒక క్యాంపు నుంచి మరో క్యాంపుకి తిరుగుతూ సకీనా కోసం వెతకడం. ఆ సాయుధ యువకులకి తన కూతురు దొరుకాలని ప్రార్థించడం అతని నిత్యకృత్యమైపోయింది.

## 'అనువాద' రచయిత(త్రి)లకో ఆహ్వానం

మీ 'జ్యోతి' ప్రతినెలా అనువాద కథల్ని తప్పనిసరిగా ప్రచురించడానికి నిర్ణయించింది. మీ నుంచి మంచి అనువాద కథల్ని ఆహ్వానిస్తోంది. కథతో మూల రచయిత(త్రి) ఆమోదం కూడా మీరు పొందితే బాగుంటుంది. లేని పక్షంలో కథ నచ్చితే ఆ రచయిత(త్రి) అనుమతి మేమే పొందుతాం.

ఎడిటర్

మా చిరునామా:
'అనువాదిక'
ఎడిటర్ 'జ్యోతి' (మాసపత్రిక)
చిక్కడపల్లి, హైదరాబాద్-20

ఆ యువకులు చెప్పిన మాటలు ఎప్పుడూ అతని చెవుల్లో గింగురుమంటూనే వున్నాయి. 'నీ కూతురు నిజంగా బతికి వుంటే తప్పక తీసుకవస్తాము.'

ఒకరోజు ఆ యువకులు అక్కడ క్యాంపులో అగుపించారు. వాళ్ళు అక్కడి నుంచి వెళ్ళిపోవడానికి సిద్ధంగా వున్నారు. 'బాబూ' అని వాళ్లలో ఒకర్ని పిలుస్తూ 'నా కూతురు సకీనా జాడేమైనా తెల్సిందా' అనడిగాడు.

'ప్రయత్నిస్తున్నాం.. ప్రయత్నిస్తున్నాం..' అని చెప్పారు ఆ యువకులందరూ.

వాళ్ళకి జయం కలుగాలని మరోసారి అల్లాని ప్రార్థించాడు సిరాజుద్దీన్.

ఆ రోజు సాయంకాలం క్యాంపులో హడావుడి కలకలం కన్పించింది. ఓ యువతి శరీరాన్ని మోసుకుంటూ వెళ్తున్న నలుగురు యువకులు కన్పించారు సిరాజుద్దీన్‌కి. అక్కడికి దగ్గర్లో వున్న రైలు పట్టాల దగ్గర ఆమె స్పృహ తప్పిపడిపోయి వుందిట. ఆమెని వాళ్ళు క్యాంప్ హాస్పిటల్‌కి తీసుకవెళ్తున్నారు. సిరాజుద్దీన్ వాళ్ళని అనుసరించాడు.

అతను కొద్దిసేపు హాస్పిటల్ బయటే వేచివుండి లోపలికి వెళ్ళాడు. ఆమె ఓ రూంలో స్ట్రెచర్‌పైన పడుకొని వుండటం గమనించాడు.

దీపం వెలిగించారు. అక్కడ పడుకున్న ఆమె ఎడమ చెంపమీద పుట్టుమచ్చ వుంది.

'సకీనా' అన్నాడు సిరాజుద్దీన్ భయాందోళనంతో కూడిన గొంతుతో.

దీపం వెలిగించిన డాక్టర్ సిరాజుద్దీన్ కేసి కన్నార్పకుండా చూశాడు.

'ఆమె తండ్రిని నేను' తొట్రుపడుతూ చెప్పాడు.

అచేతనంగా పడివున్న ఆమె శరీరానికేసి చూస్తూ ఆమె నాడిని పరీక్షించాడు డాక్టర్.

సిరాజుద్దీన్‌కి కిటికీ చూపిస్తూ 'ఖోలో' అన్నాడు డాక్టర్.

ఆ మాట వినగానే అచేతనంగావున్న ఆ యువతిలో కొంచెం కదలిక కన్పించింది. యాంత్రికంగా ఆమె తన నడుము దగ్గర వున్న శల్వార్ ముడి విప్పడానికి వెతుకులాడ్డం కన్పించింది. కదలలేని స్థితిలో వున్న చేతుల్తో అతిమెల్లిగా ఆమె నాడాని వదులు చేసి, దాన్ని కిందికి లాగి తొడల్ని బహిరంగం చేసింది.

**'ఆమె బతికే వుంది. నా కూతురు బతికే వుంది' సిరాజుద్దీన్ ఆనందంగా కేకవేశాడు.**

**డాక్టర్‌కి చల్లచెమటలు పట్టాయి.**

## కథకులకో విజ్ఞప్తి–ప్రచురించిన కథకు–150 రూపాయలు

ఇంటింటి మాసపత్రిక
మీ కథలను ఆహ్వానిస్తోంది
కథ పదిపేజీలకు మించకుండా ఉండాలి
మీ కథ వచ్చిన 15 రోజుల్లోపలమీకు జవాబు అందుతుంది
కథ 'జ్యోతి' సంపాదకవర్గానికినచ్చితే ఆమోదంతోపాటు వెంటనే
మీకు 150 రూపాయల చెక్కు పంపిస్తాం.

—ఎడిటర్